# పీడిత ప్రజల ఆప్తమిత్రుడు, విప్లవ శ్రేయోభిలాషి బాలగోపాల్‌కు రెడ్ సెల్యూట్స్ ! రాజ్యహింసకు వ్యతిరేకంగా సాహసోపేతంగా పోరాడే వాళ్ళందరికీ బాలగోపాల్ స్ఫూర్తిదాయకం !

పౌర హక్కుల ఉద్యమానికి సుదీర్ఘ కాలం నాయకత్వం వహించిన గొప్ప ప్రజాపక్ష మేధావి డా. కె. బాలగోపాల్ అక్టోబరు 8న గుండెపోటుతో అర్ధాంతరంగా వెళ్ళిపోవడం దేశంలోని ప్రజాస్వామిక, విప్లవ శ్రేణులందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. మన దేశ పీడిత ప్రజలు మరీ ముఖ్యంగా పోలీసు రాజ్యంలో నలిగే ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ కోసం అహర్నిశలు అలుపు లేకుండా పనిచేసే ఆప్తమిత్రుడ్ని కోల్పోయారు. బాలగోపాల్ తన జీవితాంతం పీడిత ప్రజల పక్షపాతిగా, విప్లవ శ్రేయోభిలాషిగా మెదులుతూ బూటకపు ఎన్‌కౌంటర్లు, పోలీసు అకృత్యాలపైన ప్రజల ప్రాథమిక హక్కుల కోసం దృఢంగా, నిర్భయంగా రాజీలేని పోరాటం చేశాడు. భారత దళారీ భూస్వామ్య, ఫాసిస్టు రాజ్యం కింద నలిగి మూలుగుతున్న ప్రజల ప్రజాస్వామిక హక్కుల నిర్విరామ పోరాట యోధుడు బాలగోపాల్ . అతని ఆకస్మిక మృతి పట్ల పీడిత ప్రజల తరపున, సి.పి.ఐ. (మావోయిస్టు) పార్టీ శ్రేణులన్నింటి తరపున కేంద్ర కమిటి తీవ్ర విచారాన్ని, బాధను వ్యక్తం చేస్తున్నది. బాలగోపాల్ మరణం భారతదేశ పౌరహక్కుల ఉద్యమానికి తేరుకోలేని, పూడ్చుకోలేని ఒక పెద్ద విఘాతం.

నేటి తరం మేధావుల ముందు బాలగోపాల్ ఒక మహోన్నతమైన ఆదర్శం. ఆయన జీవితంలోని ప్రతి అంశమూ ఒక ఆదర్శవంతమైన నమూనాయే. శ్రమ జీవుల పట్ల తిరస్కారం ప్రదర్శించే , వ్యక్తిత్వం లేని నేటితరం మేధావుల పక్కన ఆయన నిరాడంబర జీవనశైలి, కష్టపడి పనిచేసే తత్వం, ముఖ్యంగా అట్టడుగు వర్గాల ప్రజల పట్ల గాఢమైన ప్రేమ ఆపేక్షా అన్నీ అరుదైన లక్షణాలే. స్వార్థం, సంకుచితత్వం, కపటంతో నిండిపోయి అధికారానికి అంటకాగే మేధావులే ప్రధాన రాజకీయ దృశ్యాన్ని నింపేసిన నేటి స్థితిలో ప్రజల హక్కులే లక్ష్యంగా అకుంఠిత దీక్షతో సర్వశక్తులూ ధారపోసిన అతని నిబద్ధత ఒక పెద్ద వైచిత్రి. కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పోలీసులు చేసిన వందలాది బూటకపు ఎన్‌కౌంటర్లను పరిశోధించి బాలగోపాల్ నిర్భయంగా బట్టబయలు చేసిన నిజాలు, ప్రభుత్వానికి పోలీసు రాజ్యానికి వ్యతిరేకంగా ఆయన చేసిన విమర్శనాత్మక రచనలు పాలకులను, వారి ప్రోత్సాహకాల్ని పొందుతున్న పోలీసులను ఎంత ఆగ్రహోదగ్రుల్ని చేశాయంటే ఆ ధీరోదాత్తమైన కంఠాన్ని నొక్కేయడానికి వాళ్ళు ఎన్నో ప్రయత్నాలు చేశారు. 1980 ల మధ్యలో ఆయనకు అరెస్టు చేశారు. 1989లో ప్రభుత్వ ప్రేరిత హంతక ముఠాలు ఆయనను అపహరించి ఎన్‌కౌంటర్లు, పోలీసుల విషయాల్లో కలగజేసుకోవద్దంటూ బెదరించాయి. అరెస్టులు, బెదరింపులు ఆయనను నిలువరించలేక పోయాయి. ప్రజల హక్కుల కోసం అంతే నిబద్ధతతో రాజ్యహింసకు వ్యతిరేకంగా ఆయన పోరాటం చివరి దాకా కొనసాగింది. సమకాలీన సామాజికాంశాలపై ఆయన విశ్లేషణలు చాలా సంక్లిష్టమైన సమస్యల్ని కూడా ప్రజలు సరిగ్గా అర్థం చేసుకునేలా ఉపయోగపడ్డాయి. ఆయన గణిత శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సామాజిక శాస్త్రవేత్త, పౌరహక్కుల నాయకుడు కలగలిసిన వ్యక్తి.

1970ల మధ్య వరంగల్‌లో రీసెర్చ్ చేస్తున్న కాలం నుండే బాలగోపాల్‌కు అప్పటి సి.పి.ఐ (ఎమ్.ఎల్) (పీపుల్స్ వార్) ఆధ్వర్యంలో జరుగుతున్న విప్లవోద్యమంలో దగ్గరి సంబంధం ఉండేది. కాని 1990ల మధ్య కాలం నుండి సైద్ధాంతిక రాజకీయ విభేదాల కారణంగా ఆయన మెల్లగా పార్టీ నుండి దూరమవుతూ వచ్చారు. 1990ల చివరి కల్లా మార్క్సిజం, లెనినిజం నుండే ఆయన దూరం జరిగి పోస్ట్ మాడర్నిజం ప్రభావంలోకి పోయినా, పార్టీ విధానాలు, ఆచరణపై తీవ్రమైన విమర్శలు చేసినా ఆయన ఎప్పుడూ విప్లవం పట్ల సానుభూతితో, మావోయిస్టుల శ్రేయోభిలాషిగానే ఉండేవాడు. పౌరహక్కుల ఉద్యమంలోనైతే ప్రజల కోసం ఎక్కువ పని చేయవచ్చునని, రాజ్యంపై ఆయన చేసే యుద్ధానికి హక్కుల క్షేత్రాన్ని ఎన్నుకున్నాడు. ఆ రంగంలో ఆయన చాలా నిబద్ధతతో చివరి శ్వాస దాకా తొణకకుండా స్థిరంగా నిలబడ్డాడు. బాలగోపాల్ జీవితం, ఆచరణ నుండి మన సమాజంలోని మేధావి వర్గాలు ఎంతో నేర్చుకోవాల్సి ఉంది.

**అజాద్,**
భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్), కేంద్ర కమిటీ
10 అక్టోబర్ 2009